క్లుప్తంగా

కూరగాయల ధరలు...

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 45, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామ 45, కీర 25, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 45, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 20, అల్లం 300, వెల్లుల్లి 150.

'ఫిగరోస్ పిజ్జా' అవుట్‌లెట్ ప్రారంభం



పిజ్జాను చూపిస్తున్న సంస్థ ప్రతినిధులు

గచ్చిబౌలి: అమెరికాకు చెందిన ఫిగరోస్ పిజ్జాను నగర వాసులు రుచి చూసేందుకు అవకాశం దక్కింది. ఆదివారం కొండాపూర్‌లో ఫిగరోస్ పిజ్జా అవుట్ లెట్‌ను ప్రారంభించారు. క్లాసిక్ చికెన్ పెప్పరోని, రుచికరమైన చికెన్ సాసెజ్, ఆలీవ్, పుట్టగొడుగులు, కాయప్సికమ్, మొజరెల్లా చికెన్ పిజ్జాలు అందుబాటులో ఉంటాయి. ఫిగరోస్ పిజ్జా ఏరియ ఆడెవలపర్ శర్వన్ కుమార్, శంకర్ కపిలవాయి మాట్లాడుతూ నాణ్యత, అసాధారణమైన రుచి హైదరాబాద్ వాసులకు రుచి చూపిస్తామని తెలిపారు. తాజా పిండితో అవుట్‌లెట్‌లో పిజ్జా, టమోటా సాస్ తయారవుతుందన్నారు. చిన్న, మధ్యస్థ, పెద్ద సైజులో 45 రకాల పిజ్జాలు అందిస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం


హఫీజ్‌పేట్ నేతలను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న రవి కుమార్ యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవి కుమార్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్‌కు చెందిన మన్యం, శ్రీను ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీకి అత్యధిక ఆదాయం శేరిలింగంపల్లి నుంచే వస్తుందన్నారు. అయితే బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆదిత్య, శ్రీకాంత్, జగదీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఇంటింటికీ పాదయాత్ర

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీకాలనీలో పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు ఆదివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ కాలనీల్లో పాదయాత్ర చేస్తూ కాలనీలోని సమస్యలను తెలుసుకుంటున్నానని తెలిపారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ స్థానికులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని అన్నారు. డివిజన్‌లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆమెను కోరారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు వేయాల్సి ఉందని వాటిని కూడా త్వరగా వేసి పూర్తి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రంగమోహన్, పాతూరి గోపి, కట్టా నర్సింగరావు, తిరుపతిరావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, వాసువర్మ, లక్ష్మీ రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తకు పరామర్శ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ పరిధిలోని సాయికాలనీకి చెందిన బీజేపీ కార్యకర్త ప్రశాంత్ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఇంద్రేశం సాయిప్రియ కాలనీ సమీపంలోని ఓ ఇంటి వద్ద పెయింటింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం ప్రశాంత్ నివాసానికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మహిళ ఆత్మహత్య

భాగ్యనగర్‌కాలనీ: భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రేమ్‌సాగర్ తెలిపిన వివరాల ప్రకారం .. మహబూబ్‌నగర్ జిల్లాకు జిల్లెల మంజుల (35) రాజీవ్‌గాంధీ నగర్ ఏ-బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తలు కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తరచూ గొడవలతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతురాలి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టిగా సాధించారు

- ఇంకుడు గుంతల ఏర్పాటుతో నీటి పరిరక్షణ
- వేసవిలో భూగర్భ జలాలు ఇంకిపోకుండా ప్రత్యేక చర్యలు
- ఈ నీటి వినియోగంతో కాలనీలో పార్కుల నిర్వహణ
- కాలనీలో 110 ఇంకుడు గుంతల ఏర్పాటు
- ఇదీ శేరిలింగంపల్లి 'లక్ష్మీవిహార్ ఫేజ్-2' కాలనీవాసుల ఘనత'


లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీ

శేరిలింగంపల్లి: ఆ కాలనీలో ఎటు చూసినా పచ్చదనం పరచుకుంది. ఆహ్లాదభరిత వాతావరణంతాకట్టుకుంటోంది. ఎన్నో ఏళ్లుగా కాలనీవాసులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న ఇంకుడు గుంతలే అందుకు ప్రధాన కారణం. కాలనీలో ఏటా 'ప్రకృతి దేవోభవ' పేరిట కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టి మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నారు. కాలనీలో పెద్ద ఎత్తున వర్షపు నీటిని పరిరక్షించేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని భూగర్భ జాలాలు అడుగంటకుండా జాగ్రత్త పడుతున్నారు. ప్రతి ఏటా శుభ్రం చేసి వర్షపు నీరు రీచార్జ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో వాటిని క్లీన్ చేసే పనులు చేపడుతూ ముందుకుసాగుతున్నారు. అందుకు శేరిలింగంపల్లిలోని లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కాలనీ అంతటా పచ్చదనం పర్చుకోవడానికి ఆహ్లాదపూరిత వాతావరణం నెలకొనేందుకు కాలనీ వాసులు ఎంతో శ్రద్ధ చూపుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఇంకుడు గుంతలను శుభ్రం చేస్తూ కొత్తగా ఏర్పాటు చేయాల్సిన వాటి కోసం సన్నాహాలు చేపడుతున్నారు.

వంద అడుగుల్లోనే నీరు

- భూగర్భ జలాల సామర్థ్యం తగ్గకుండా ఉండేందుకు కాలనీలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నారు.
- నగరంలో ఎక్కడ బోరు వేసినా వెయ్యి అడుగులు మించనిదే నీటి జాడ కనిపించని పరిస్థితి.
- కాగా ఈ కాలనీలో వేసవిలో కూడా వంద అడుగుల్లోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయంటే కాలనీ వాసులు పట్టుదల, ఆసక్తి, కృషికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

ఇంటికో ఇంకుడు గుంత

- శేరిలింగంపల్లి లక్ష్మీవిహార్ ఫేజ్-2కాలనీలో 87 నివాసాలు ఉండగా వాటిలో 60కి ఇళ్లల్లో పైగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా కాలనీ రోడ్లపై 50 వరకు గుంతలను ఏర్పాటు చేశారు.
- కాలనీలో 135 ఫీట్లతో వేసిన బోరుతోనే కాలనీలోని మొక్కలు, గార్డెన్‌కు నీరు అందుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఏటా క్లీన్ చేస్తాం...



కాలనీలోని ఇంకుడు గుంతలను ప్రతి ఏటా క్లీన్ చేసి, వర్షపు నీరు రీచార్జ్ అయ్యేలా చూస్తాం. వర్షపు నీటిని ఒడిసి పడితేనే నీటి సమస్యను నివారించవచ్చు. వర్షం ద్వారా వచ్చిన వర్షపు నీరు కాలువల ద్వారా సముద్రం పాలు కాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయాలి. అందుకోసం ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాలు, పార్కుల్లో ఇంకుడు గుంతల ఏర్పాటు చేయాలి

– రవీంద్ర ప్రసాద్ దూబే
– కాలనీ అధ్యక్షులు


ఇంకుడు గుంతలను శుభ్రం చేస్తున్న దశ్యం



రోడ్లపై ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు

అలరించిన నృత్య ప్రదర్శనలు


శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అరుణోదయ కళాసమితి లతామంజూష, మోహన్‌రెడ్డి శిష్యబృందం కూచిపూడి, భరతనాట్యాంశాలను ప్రదర్శించారు. ఇందులో వినాయకస్తుతి, అలరిపు, జతిస్వరం, అష్టలక్ష్మిస్తోత్రం, సరస్వతి వందనం, తిల్లాన, అధియోగి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్య గురువు సంజయ్‌కుమార్ జోషి, రవికూచిపూడి కళాకారులు ప్రణతి, అమృత, ధార్మిక, వినితి, కార్తీక, రక్షణ, మాలిన్య, పూర్ణిమ, వర్ష, నవ్య, సౌదామినిని సత్కరించారు. – మాదాపూర్

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న పారుపల్లి కశ్యప్

మాదాపూర్: అంతర్జాతీయ హెచ్ఆర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లో రెండురోజుల పాటు కొనసాగుతున్న బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగిసింది. మాదాపూర్‌లోని గేమ్‌పాయింట్‌లో ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన హెచ్ఆర్ నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అర్జున అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడ శారీర దారుఢ్యానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. హెచ్ఆర్ నిపుణులు పలు క్రీడల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మెమోంటోలను అందించారు. కార్యక్రమంలో కేక సీఈఓ విజయ్ యలమంచిలి, హెచ్ఆర్ నిపుణులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

మియాపూర్: మియాపూర్‌లోని నడిగడ్డతాండలో సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతాండ వాసులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తేవడంతో సొంత నిధులతో బోరు వేయించి ట్యాంకును ఏర్పాటు చేయించి కాలనీ వాసుల సమస్యను పరిష్కరించామన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీతారాంనాయక్ , రెడ్యా నాయక్, చందుయాదవ్, రాఘవేంద్ర, మోహన్, మధు, బీజేపీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


నడిగడ్డతాండలో బోరును ప్రారంభిస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

అమెరికన్ ఐ హాస్పిటల్ ప్రారంభం


అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

మియాపూర్: మియాపూర్ మదీనాగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్‌ను చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సేవా దృక్పథంతో సరసమైన ధరలతో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజల మన్ననలు పొందుతూ మరింత ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, ఆవుల రవీందర్‌రెడ్డి, అమెరికన్ ఐ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఎం. రమేష్‌చంద్ర, మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, మిరియాల రాఘవరావు, వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

క్రీడలు ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడతాయి

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివారం క్రీడాకారులకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు హాజరై ఆట వస్తువుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. యువత క్రికెట్ కిట్లను, వాలీబాల్, క్యారం బోర్డు, చెస్, షటిల్ వంటి క్రీడా కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు హరినాథ్, విమల్‌కమార్, చంద్రమోహన్ సాగర్, రఘునాథ్, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, అష్రఫ్, మురళీ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

మియాపూర్: చందానగర్, మియాపూర్ డివిజన్ల పరిధిలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చందానగర్‌లో హుడా సెంటర్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ జెరిపెటి జైపాల్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏ బ్లాక్ ప్రెసిడెంట్ ఇలియాజ్ షరీఫ్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


శేరిలింగంపల్లి రాజీవ్ గృహకల్పలో..


చందానగర్‌లోని హుడా సెంటర్ వద్ద..


మియాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

ఆలయ నిర్మాణానికి సహకారం

జిన్నారం(పటాన్‌చెరు): బసవేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి పూర్తి సహకారాన్ని అందిస్తున్నామని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి తెలిపారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీరాం నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న బసవేశ్వర స్వామి దేవాలయ నిర్మాణ పనులను ఆదివారం చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటయ్య, నర్సింహ్మా, సత్తయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురానికి నూతనంగా మంజూరైన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాలను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా రామచంద్రాపురం పట్టణంలోని గెస్ట్‌హౌస్, లింగంపల్లిలోని పోలీస్ క్వాటర్స్‌ను ఆదివారం పరిశీలించారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

మియాపూర్: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండి రమేష్ అన్నారు. ఆదివారం మియాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా పార్టీకి రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందించానన్నారు. ప్రస్తుతం శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చిన సమన్వయంతో పనిచేసి అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులతో కలిసి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మొవ్వ సత్యనారాయణ, సీతారామరాజు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, షేక్ హమీద్ పటేల్, నాయకులు కొమండ్ల శ్రీనివాస్ రెడ్డి, వాలా హరీష్‌రావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బండి రమేష్ తదితరులు

మైసమ్మ చెరువు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్‌లోని మైసమ్మ చెరువును ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 84 ఎకరాలు ఉన్న ఈ చెరువు ప్రస్తుతం 40 ఎకరాలు కూడా లేకుండా కబ్జా చేశారన్నారు. వెంటనే కబ్జాపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కూకట్‌పల్లి ఎంఆర్ఓకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు గొపిశెట్టి రాఘవేంద్ర, ఎన్ఎస్‌యుఐ స్టేట్ జనరల్ సెక్రటరి సయీద్ మిస్బా, మైనార్టీ చైర్మన్ అజీమ్ బాయ్, షఫీయుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ, తూము సంతోష్ కుమార్, మూసాపేట డివిజన అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, జావ ఆలీ, గురుమూర్తి, ఎలియాజ్, అక్బర్, ఉదయ్‌రావు, శివకుమార్, పల్లపు వేణు, కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల భవనం ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం సమర్పిస్తున్న దివ్యాంగుల పట్టణ సమాఖ్య ప్రతినిధులు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దివ్యాంగుల భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీకి ఆదివారం దివ్యాంగులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి దివ్యాంగుల పట్టణ సమాఖ్య అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రతినెల దివ్యాంగుల ప్రతినిధుల సమావేశం నిర్వహించేందుకు సరైన వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రత్యేకంగా దివ్యాంగుల భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దివ్యాంగుల కోసం స్థలం కేటాయించి భవనం నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ దివ్యాంగుల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన 'నారాయణ స్మరణం'


అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న డాక్టర్ శోభారాజ్ తదితరులు

హఫీజ్‌పేట్ : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో ఆదివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభా రాజ్ తన తండ్రి ఆర్ జి నారాయణ రాజును స్మరిస్తూ 'నారాయణ స్మరణం'తో నిర్వహించిన అన్నమయ్య కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ శోభారాజ్ శిష్యులు అన్నమయ్య కీర్తనలు ఆలపించి అందరినీ ఆధ్యాత్మిక చింతనలో ఓలలాడించారు. అదివో అల్లదిహో, కొండలలో నెలకొన్న, బ్రహ్మ మొక్కటే పర బ్రహ్మ మొక్కటే, విచ్చేయవమ్మా తదితర సంకీర్తనలను ఆలపించారు. కీబోర్డ్‌పై మారుతి కిరణ్, తబలాపై నోవా వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ నారాయణ, సభ్యులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: రామ్‌దేవ్‌రావు హాస్పిటల్, సర్వ ప్రేమ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 6-18 సంవత్సరాల పిల్లలకు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఈ క్యాంపులో 700 మంది చిన్నారులు వారి తల్లిదండ్రులు ఉచిత సేవలను పొందారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పిల్లల డాక్టర్ విజయానందు, గైనకాలజిస్ట్ డా. చాయాదేవి, కంటి వైద్య నిపుణులు డా. రాధ, దంతవైద్య నిపుణులు డా. కిరణ్‌కూర్‌తదితరులు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ కె. కమలాకర్, మెడికల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆస్పత్రి సీఈఓ డా. ఎస్.యోబు తెలిపారు. ఈ క్యాంపులో వైద్యులు రోహిత్, లావణ్య, ప్రిన్సి బెనెట్, వినీష, జుబేర్, స్మృతి, భానుప్రకాష్, ప్రశాంతి, సాగరికలుఆస్పత్రి సిబ్బంది కల్పన, రమాదేవి, ఆలీ, జ్యోతి, కవిత, తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం...

ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా రామ్‌దేవ్‌రావ్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ ప్రారంభించారు. ఆస్పత్రి సిబ్బందితో కేక్ కట్ చేసి కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్‌చంద్ర, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, ఇంతియాజ్, శ్రీధర్, ఉమేష్, గైనకాలజిస్ట్ డా. తులసమ్మ, పిడియాట్రిక్ వైద్యులు డాక్టర్ విజయానంద్, డెంటల్ డా. కిరణ్, ఆప్తమాలజిస్ట్ డా. రాధ తదితరులు పాల్గొన్నారు.